ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
065-11-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 61 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

కులగణనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. రేపటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభం కానున్న తరుణంలో సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే బీసీ జనాభా గణాంకాల సేకరణకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచన మేరకు ప్రభుత్వం ఉత్తర్వుల విడుదల చేసింది. బీసీ కులగణనకు డేడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర్ రావును నియమించారు. నెలరోజుల్లో కమిటీ రిపోర్టు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# తెలంగాణ వ్యాప్తంగా కులగణన...

...మిగతాది 2 లో



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:** రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలను శాస్త్రీయమైన పద్ధతిలో తేల్చాలని హైకోర్టు సూచించింది. దీని కోసం 2 వారాల్లో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని అక్టోబర్ 30న ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం వారం రోజుల్లోనే ఈ కమిషన్ ను నియమించింది.డిసెంబర్ 9లోగా బీసీ కులగణన పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. బీసీ వర్గాల్లోని కులాలు, వాటి ఉపకులాల లెక్క తేల్చబో తున్నారు. వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల వివరాలను సైతం సేకరించనున్నారు. మొత్తం 60 రోజుల్లో ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కులగణనకు అవసరమైన ప్రొఫార్మాను బీసీ కమిషన్ ఇప్పటికే తయారు చేసింది. దాదాపు 54 నుంచి 64 ప్రశ్నలతో



▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ వ్యాప్తంగా కులగణన...

ప్రశ్నావళిని సిద్ధం చేసినట్టు సమాచారం.రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దశలో బీసీ గణన చేపట్టి పూర్తి వివరాలను సేకరించనున్నారు అధికారులు. ఈప్రక్రియ త్వరగా పూర్తి చేస్తామంటున్నారు. ఇందుకు దాదాపు 80 వేల మంది ఎన్యుమరేటర్లు, 10 వేల మంది సూపర్ వైజర్లు అవసరమవుతారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సిబ్బందికి హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ పూర్తి అయ్యింది. ఈ శిక్షణ తీసుకున్న వారంతా జిల్లాల్లో ఇతర సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. కులగణన పూర్తి చేసి..ఆ వివరాలను కంప్యూటర్‌లో పొందపరుస్తారు. ఏ రోజు వివరాలను ఆ రోజే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. జిల్లాల కలెక్టర్లు బాధ్యతలను పర్యవేక్షిస్తారు. మొత్తం వివరాలను బీసీ కమిషన్ పరిశీలించి.. వాటిని క్రోడీకరించి స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్లను సూచిస్తూ ప్రభుత్వానికి రిపోర్టును సమర్పించనుంది.

**హైదరాబాద్ లో రాహుల్**

కాంగ్రెస్ హైకమాండ్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కులగణన కార్యక్రమం. బుధవారం నుంచి తెలంగాణ వ్యాప్తంగా ఈ కార్యక్రమం మొదలుకానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాయ్‌బరేలి నుంచి మంగళ వారం సాయంత్రం హైదరాబాద్‌కు రానున్నారు. ప్రత్యేక విమానంలో నేరుగా బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకున్నారు.అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ట్రావెల్ చేసి సాయంత్రం ఐదున్నర గంటలకు బోయిన్ పల్లిలో గాంధీ ఐడియాలాజీ సెంటర్‌కు వెళ్లారు. గంటన్నరపాటు కులగణనపై జరిగిన సదస్సులో 400 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కవులు, కళాకారులు, మేధావులు హాజరవుతారు. కులగణనపై మేధావులు, వివిధ సంఘాల నుంచి వివరాలు అడిగి తెలుసున్నారు.ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లిలో గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో విస్తృతంగా ఏర్పాటు చేపట్టారు.సదస్సు వేదికపై రాహుల్‌తోపాటు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ మాత్రమే అవకాశం ఇచ్చారుతెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు రాహుల్‌గాంధీ. దాదాపు ఏడాది తర్వాత హైదరాబాద్‌కు అగ్రనేత రావడంతో భారీ ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం రాత్రి ఏడున్నర గంటలకు హైదరాబాద్ నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు రాహుల్‌గాంధీ.

---

## "కొత్త" ఈవోకు "పాత" సమస్యలు స్వాగతం..

- పరిపాలనలో "ప్రక్షాళన" జరిగేనా...?
- బాపిరెడ్డి బాప్ రే అనిపిస్తారా...?



✍ జయభేరి, శ్రీకాళహస్తి, నవంబర్ 5:

ఏడాదికి 150 కోట్ల రూపాయల ఆదాయం కలిగి... రెవెన్యూ జాయింట్ కమిషనర్ స్థాయి కలిగిన శ్రీకాళహస్తి ఆలయానికి ఆర్డీఓ సాయి అధికారి బాపిరెడ్డి ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ శాఖకు చెందిన ఆయన దేవాదాయ శాఖకు రావడం ఇదే మొదటిసారి. రెవెన్యూకు, దేవదాయ శాఖకు పరిపాలనలో చాలా తేడాలున్నాయి. భూముల సమస్య తప్ప మిగిలినవన్నీ ఆయనకు సంబంధం లేని అంశాలే.వాటిపై అవగాహన పెంచుకోవలసి ఉంది.రాహు కేతు క్షేత్రమైన శ్రీకాళహస్తిలో అనేక సమస్యలున్నాయి. ఆలయంలో దళారుల బెడద ముఖ్యమైనది. మొన్నటి వరకు ఇన్చార్జిగా వ్యవహరించిన చంద్రశేఖర్ ఆజాద్ వచ్చిన వారం రోజుల్లో దళారులు ఆలయంలోకి రావడానికి భయపడ్డారు. ఆ తర్వాత మెల్లమెల్లగా అందరూ రాకపోకలు సాగిస్తున్నారు. వీరికి, కొందరు సిబ్బందికి మంచి సంబంధాలున్నాయి. వీరిలో రాజకీయ, వివిధ శాఖల వారున్నారు. సిబ్బందికి సంప్రదాయ వస్త్రధారణ మంచి ఫలితాలను ఇస్తున్నది. అయితే రాహు కేతు పూజలు చేసుకునే భక్తులు కూడా సంప్రదాయ వస్త్రధారణ చేయాలనే ఆజాద్ నిబంధన ఇబ్బందికరంగా మారింది. సంప్రదాయ దుస్తులు లేని పురుషులను బలవంతంగా వెనక్కి పంపడంపై వివాదాలు జరిగాయి. సిబ్బందిలో జవాబుదారీతనం పెరిగింది. పనుల్లో వేగం పుంజుకుంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తారనే భయం సిబ్బందిలో ఏర్పడింది. అయితే ఆలయ పరిపాలనకు కొత్త ఆయన బాపిరెడ్డి ఏ విధంగా వ్యవహరిస్తారో చూడాలి. గత ఐదేళ్ల పాలనలో మాస్టర్ ప్లాన్ పూర్తిగా మరుగున పడింది. మాస్టర్ ప్లాన్ స్థలంలో లాడ్జి నిర్మాణానికి నాయకులు అవసరమైన అన్ని అనుమతులు దగ్గరుండి ఇప్పించారు. మాస్టర్ ప్లాన్ కు తూట్లు పొడిచారు.

అదేవిధంగా తాత్కాలిక షెడ్లను నిర్మించి నిధులను దుబారా చేశారు. దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఆశయాల మేరకు మాస్టర్ పాన్ అమలు చేయాల్సిన బాధ్యత ఆయన కుమారుడైన ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై ఉంది. అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి ఆలయానికి స్వాధీనం చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రాహు కేతు పూజల్లో అవినీతి అక్రమాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. భరద్వాజ తీర్థం ప్రాంతాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించే విధంగా దాతలను సంప్రదించి... విరాళాలు సేకరించాల్సి ఉంది. భక్తులకు స్నానపు గదులు, సెల్‌ఫోన్ కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు ఉచితంగా పలుచోట్ల ఏర్పాటు చేయాలి. కైలాసగిరిలో పచ్చదనం పెంచడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలి. రాహు కేతు గ్రహాలకు మించి వ్యవహరిస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అటువంటి వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేయించాలి. భక్తులకు మంచి దర్శనం కలిగే విధంగా ప్రణాళిక చేయాలి. అనవసర నిర్మాణాలు చేసి, నిధులు ఖర్చు చేస్తున్న ఇంజినీరింగ్ వారిపై చర్యలు తీసుకోవాలి. స్థానిక వ్యాపారుల వల్ల భక్తులు మోసపోకుండా నిఘా పెంచాలి. పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించి... ట్రాఫిక్ సమస్య లేకుండా నివారించాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ శాఖకు చెందిన బాపిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం ఏడాది పాటు ఈవోగా కొనసాగడానికి ఉత్తరువు ఇచ్చింది. అందరిలాగా "రెవెన్యూ" కు ప్రాధాన్యత ఇస్తారా....? పరిపాలనకు పెద్దపేట వేస్తారా...? బాపిరెడ్డి బాప్ రే అనిపిస్తారా అనేది వేచి చూడాల్సిందే...

---

## శంషాబాద్ ఆలయంలో విగ్రహాలు ధ్వంసం

✍ జయభేరి, రంగారెడ్డి:

హైదరాబాద్ లోని ముత్యాలమ్మ దేవాలయం లో దేవుడి విగ్రహాల ధ్వంసం ఘటనను మర్చిపోకముందే నగర శివారులోని శంషాబాద్ లో మరో దేవాలయం పై గుర్తు తెలియని దుండగులు దాడి కి పాల్పడడం కలకలం రేపింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి హనుమాన్ దేవాలయం లోకి ప్రవేశించిన గుర్తు తెలియని దుండగులు నవగ్రహాలను రాళ్లతో ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి నవగ్రహాల ధ్వంసాన్ని చూసి గ్రామస్తులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అలర్ట్ అయిన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. దుండగులు రాళ్లతో విగ్రహాలను ధ్వంసం చేసినట్లుగా ఆనవాళ్లు లభించాయి. ఈ మేరకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించి ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. ఘటనను కాలనీవాసులు తీవ్రంగా ఖండిస్తున్నారు. వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

---

# టార్గెట్ బీసీ..
# కాంగ్రెస్ నయా ప్లాన్

**రాబోయే నాలుగేళ్లలో ఒక్కో వర్గానికి దగ్గరవుతూ..వారిని కాంగ్రెస్ కట్టర్ ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ప్లాన్ చేస్తోంది. అందుకే అలా ఎన్నికలు ముగిశాయో లేదో.. అప్పుడే మళ్లీ వచ్చే ఎన్నికల కోసం ప్లాన్లు రచిస్తోంది. యాదవ, కురుమ సామాజికవర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు అమలు చేస్తుంది.**



✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 5:

**సదర్‌ను అధికారికంగా నిర్వహించడం వెనక మరో కారణం ఉందట. త్వరలో GHMC ఎన్నికలు రాబోతున్నాయి. గ్రేటర్‌లో జరగనున్న ఎన్నికల్లో యాదవ ఓటర్లను ఆకట్టుకునేందుకే సీఎం సదర్‌ను అధికారికంగా నిర్వహించారన్న టాక్ కూడా ఉంది. ఇలా ఏ చిన్న అంశాన్ని వదులుకోవడం లేదు సీఎం రేవంత్.**

తెలంగాణలో యాదవ, కురుమ సామాజికవర్గాల ఓట్లు పెద్దసంఖ్యలో ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కురుమ సామాజికవర్గానికి చెందిన వారు చాలా ఎక్కువగా ఉంటారు. అందుకే గత ప్రభుత్వంలో ఈ వర్గాలను ఆకట్టుకోవడం కోసం సబ్సిడీ కింద గొర్రెలు ఇచ్చారు. ఈ స్కీమ్‌తో మెజారిటీ కురుమ, యాదవ ప్రజలు బీఆర్ఎస్ వైపు మళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిధుల కొరత కారణంగా గొర్రెల స్కీమ్‌ను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ పట్ల యాదవ, కురుమలు కాస్త గుర్రుగా ఉన్నారు. దీంతో వారిని కాంగ్రెస్ వైపు తిప్పుకునేందుకు ప్రభుత్వ పెద్దలు సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. దీపావళి సందర్భంగా పట్టణాలలో యాదవ, కురుమలు సదర్ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ సదర్‌ను ఎక్కువగా హైదరాబాద్ సిటీలో నిర్వహిస్తుంటారు. ఈ సారి సదర్‌ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. కొన్ని నిధులు కూడా కేటాయించింది.రాష్ట్ర ప్రభుత్వం తరపున సదర్‌ను అధికారికంగా నిర్వహించడంతో పాటు.. సదర్ వేడుకలకు స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఇప్పటి వరకు చరిత్రలో ఏ సీఎం కూడా సదర్ వేడుకకు ముఖ్యమంత్రి హోదాలో హాజరు కాలేదట. ఫస్ట్ టైం ఒక సీఎంగా రేవంత్ రెడ్డి సదర్ వేడుకకు హాజరయ్యారు.

దీంతో ఆయా వర్గాలను మచ్చిక చేసుకోవడంతో పాటు వారిలో పాజిటివ్ అభిప్రాయం వచ్చేలే ప్రయత్నం చేశారు. యాదవ, కురుమ వర్గాలు కూడా సీఎం హాజరు కావడం.. సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించి నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు కులగణనకు శ్రీకారం చుడుతోంది సర్కార్. బీసీల కోసమే ఈ కులగణన చేపడుతున్నట్లు కూడా చెప్పకనే చెప్తోంది. బీసీల్లో కూడా యాదవులు, కురుమలు పెద్ద సంఖ్యలో ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో కురుమలు ఓట్లు ఎక్కువగా ఉంటాయి. హైదరాబాద్‌లో యాదవులు ఎక్కువగా ఉంటారు. ఈ రెండు వర్గాలకు దగ్గరైతే అటు గ్రామీణ ప్రాంతంలో.. ఇటు పట్టణాల్లో బలంగా ఉంటామని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. అంతేకాదు సదర్‌ను అధికారికంగా నిర్వహించడం వెనక మరో కారణం ఉందట. త్వరలో GHMC ఎన్నికలు రాబోతున్నాయి. గ్రేటర్‌లో జరగనున్న ఎన్నికల్లో యాదవ ఓటర్లను ఆకట్టుకునేందుకే సీఎం సదర్‌ను అధికారికంగా నిర్వహించారన్న టాక్ కూడా ఉంది. ఇలా ఏ చిన్న అంశాన్ని వదులుకోవడం లేదు సీఎం రేవంత్.

**బీసీ కమిషన్ ఏర్పాటు**

కులగణనపై తెలంగాణ సర్కార్ ఫోకస్ పెట్టింది. కులగణన కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ ఛైర్మన్ గా మాజీ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర రావుని నియమించింది. సహాయకుడిగా ఐఎఫ్ఎస్ అధికారి బి. సైదులును ఎంపిక చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన 24 గంటల్లోనే ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్లుండి నుంచే ప్రభుత్వం కులగణన చేపట్టనుంది. 1993 బ్యాచ్ కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు.. 2019లో రిటైర్ అయ్యారు. టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఆయన పని చేశారు.ఈ నెల 6 నుంచి కులగణన చేపట్టబోతోంది ప్రభుత్వం. పూర్తి స్థాయిలో దానికి సంబంధించి రంగం సిద్ధం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారానికి సంబంధించి ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 1993 బ్యాచ్ కి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావును తెలంగాణ డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఇది ఏకసభ్య కమిషన్. కులగణనకు సంబంధించిన వ్యవహారంలో డెడికేటెడ్ కమిషన్ చాలా కీలకంగా వ్యవహరించబోతోంది. భవిష్యత్తులో కులగణనకు సంబంధించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే, కోర్టు చిక్కులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో న్యాయస్థానం సూచనలతో డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2019లో రిటైర్ అయిన వెంకటేశ్వరరావు గతంలో టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్ గానూ పని చేశారు. మొత్తానికి ఇదొక కీలక నిర్ణయంగా చెప్పొచ్చు. గతంలో సీఐడీ, విపత్తుల నిర్వహణ స్పెషల్ సీఎస్ గానూ భూసాని వెంకటేశ్వరరావు పని చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో రేవంత్ ప్రభుత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.

---

## మూసి చుట్టూ రేవంత్ పాదయాత్ర

✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 5:

**మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై ముందుకు వెళతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 8న సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో సీఎం పాదయాత్రకు స్థానిక నేతలు ప్లాన్ చేస్తున్నారు.ఆరు నూరైనా మూసీ నది పునరుజ్జీవం కోసం ముందుకు వెళతామని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ దిశలో వడివడిగా అడుగులు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకునట్లే కనిపిస్తోంది.**

మూసీ కాలుష్య మురుగు నీటితో అష్టకష్టాలు పడుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల బాధలు తెలుసుకునేందుకు నేరుగా రంగంలోకి దిగనున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 8వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన యాదాద్రిలో లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోనున్నారు.సీఎం



యాదాద్రి పర్యటన అధికారికంగా ఖరారైంది. యాదాద్రి సందర్శన తర్వాత వలిగొండ నుంచి రామన్నపేట మండలాల పరిధిలో మూసీ పరీవాహక ప్రాంతాల గుండా సీఎం రేవంత్ రెడ్డితో పాదయాత్ర చేయించే పనిలో ఈ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలుస్తోంది. మరో వైపు సీఎం యాదాద్రి పర్యటన నేపథ్యలో ఈ జిల్లాలో పేరుకున్న పోయిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాలు కనుగొనేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలతో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం సాయంత్రం హైదరాబాద్ లో సమీక్ష కూడా జరిపారు.మూసీ ప్రక్షాళనలో భాగంగా శుద్ధీకరణ, నదికి పునరుజ్జీవం కల్పించాల్సిన అత్యవసర పరిస్థితిని జిల్లా ప్రజలు, మూసీ పరీవాహక ప్రాంత రైతాంగంలోకి విస్తృతంగా తీసుకువెళ్లే పనిలో కాంగ్రెస్ నాయకత్వం ఉంది. మూసీ ప్రక్షాళణ విషయంలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్న ప్రతిపక్షాల కుట్రలను ఎండగట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అదే సమయంలో మల్లన్నసార్ నుంచి యాదాద్రి, మేడ్చల్ జిల్లాలకు తాగునీరు అందించే ప్రాజెక్టును రూ.210 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనుండగా ఈ పనులకు సీఎం రేవంత్ రెడ్డి 8వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. "దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే.. కాళ్లు, చేతులు వంకర్లుపోయి, క్యాన్సర్ వంటి జబ్బులతో చచ్చిపోతుంటే.. బీఆర్ఎస్ పార్టీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు .." అని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తన సమీక్ష సమావేశంలో ఆగ్రహంవ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మూసీ బాధితులను రెచ్చగొట్టి రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయత్నిస్తున్నాయని.. పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసి ఈ తప్పుడు ప్రచారాలను అడ్డుకోవాలని కూడా మంత్రి సమీక్ష సమావేశం నిర్ణయించింది. అన్ని జిల్లాల ప్రజలు గోదావరి, కృష్ణానీళ్లతో వ్యవసాయం చేస్తూ, తాగునీటిని వాడుకుంటుంటే.. భయంకరమైన రసాయనలు కలిసిన మురికినీళ్లను ఉమ్మడి నల్గొండ ప్రజలు ఎందుకు వాడుకోవాలన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటనలో భాగంగా 8వ తేదీన మూసీ వెంట పాదయాత్ర చేయించాలన్న ప్లాన్‌తో ఉన్నారు.అయితే,సీఎం పాదయాత్ర అధికారికంగా మాత్రం ఖరారు కాలేదు. కానీ, ఈ ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యే సీఎం రేవంత్ రెడ్డిని ఇప్పటికే ఒప్పించారని సమాచారం అందుతోంది. ఆసిఫ్ నహర్ ప్రాజెక్టు కాల్వల మీదుగా, మూసీ పరీవాహక ప్రాంత రైతులను కలుస్తూ, వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ పాదయాత్ర జరపాలన్న నిర్ణయం ఇప్పటికే జరిగిపోయిందంటున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూనే..మూసీ మురుగునీటి ప్రధాన బాధితులుగా ఉన్న ఉమ్మడి నల్గొండ రైతాంగం, ప్రజల మద్దతు కూడగట్టేందుకు సీఎం పర్యటనను ఉపయోగించుకోవాలని జిల్లా ప్రజాప్రతినిధులు ప్లాన్ తో ఉన్నారని చెబుతున్నారు.

---



## ఇవాళే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

✍ జయభేరి, విజయవాడ, నవంబర్ 5:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ మరికొన్ని గంటల్లో విడుదల కానుంది. టెట్ ఫలితాలను సోమవారం విడుదల చేసిన విద్యాశాఖ ఇక మెగా డీఎస్సీ ప్రకటనకు సన్నద్ధమవుతుంది. బుధవారం (నవంబర్ 6వ తేదీన) మెగా డీఎస్సీ ప్రకటన విడుదల చేయనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ క్లారిటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కూడా రేపటి నుంచే ప్రారంభం కానుంది. మొత్తం నెల రోజుల పాటు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిసెంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.దాదాపు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన విడుదలకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మొత్తం పోస్టుల్లో ఎస్జీటీ 6371 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7725 పోస్టులు, టీజీటీ 1781 పోస్టులు, పీజీటీ 286 పోస్టులు, ప్రిన్సిపల్ 52 పోస్టులు, పీఈటీ 132 వరకు పోస్టులు ఉండనున్నాయి. రేపు వెలువడనున్న నోటిఫికేషన్‌లో ఈ పోస్టుల సంఖ్య కూడా మారే ఛాన్స్ లేకపోలేదు. కర్నూలు జిల్లాలో ఎస్జీటీ పోస్టులు అత్యధికంగా ఉన్నాయి. అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లాలో ఉన్నాయి.అయితే టెట్ పరీక్షల మాదిరిగానే డీఎస్సీ పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో అనేక విడతల్లో పరీక్షలు నిర్వహించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఎస్జీటీ పోస్టులకు పోటీ పడేవారు అధికంగా ఉండటంతో ఈ పోస్టులకు సంబంధించిన పరీక్ష నిర్వహణకు వారం రోజుల సమయం పడుతున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. దీంతో పరీక్షల ఫలితాలను నార్మలైజేషన్ చేసి విడుదల చేయాల్సి వస్తుంది. ఈ సమస్య లేకుండా ఉండేందుకు రెండు, మూడు జిల్లాలకు ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే ఎలా ఉంటుందని కోణంలో విద్యాశాఖ యోచిస్తోంది. ఇది ఎంత వరకు సత్ఫలితాలను ఇస్తుందనే దానిపై కూడా ఆరా తీస్తున్నారు. మొత్తానికి విద్యాశాఖ డీఎస్సీ పరీక్షల నిర్వహణకు సరికొత్త ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్లారిటీ రావాలంటే రేపటి వరకు వెయిట్ చేయాల్సిందే..!

# మార్పు అనుకుంటూ.. కొంపలు ముంచుతున్న రేవంత్ సర్కార్

■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ నవంబర్ 5



మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు పుచ్చుకున్నారు ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇందిరా పార్క్ వద్ద "ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలే. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని...రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం.

కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో...ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభమయ్యాయి. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలే. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నేరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి...మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు.ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు.ఎన్నికేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నాను అని కేటీఆర్ తెలిపారు.

---



## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన స్కంధవి

■ విద్యార్థిని అభినందించిన పాఠశాల యాజమాన్యం , గ్రామస్తులు

■ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆశాభావం

జయభేరి, నవంబర్ 5:

కేశవరం గ్రామానికి చెందిన మేడోజీ స్కంధవి మజీద్ పూర్ లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో చదువుతుంది. కాగా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 న కీసరలోని సెరినిటి పాఠశాలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో పాల్గొన్న స్కంధవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అయితే ఈ నెల 7,8 వ తేదిల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విద్యార్థి చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, పీఈటీ లు ఆశాభావం వ్యక్తం చేసి విద్యార్థిని అభినందించారు.

---

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థి

■ విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్ రంగారావు



జయభేరి, పరవాడ:

రాష్ట్రస్థాయి నెట్ బాల్ యు 17 పోటీలకు పరవాడ మండలం గొర్లవానిపాలెం లో గల శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థి లిఖిత్ రావు ఎంపిక అయ్యారని శ్రీసాయి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల తొమ్మిదవ తేదీ నుండి 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరగనున్న నెట్ బాల్ యు సెవెంటీన్ లో ఈ విద్యార్థి పాల్గొంటారని తెలిపారు.ఈ విద్యార్థున్ని శ్రీ సాయి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ రంగారావు అభినందించారు. ఈయన క్రీడల్లో ఉన్నత శిఖరాలను అవరోదించాలని ఆకాంక్షించారు.

---

## వర్గీకరణ పై మరో పోరాటం తప్పదు

■ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి

■ ఎంజేఎఫ్ రాష్ట సధస్సును జయప్రదం చేయండి

■ ఎంజేఎఫ్ జాతీయ ఇన్చార్జ్ తిప్పరపు లక్ష్మణ్ మాదిగ

జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:



సుప్రీంకోర్టు ఏబిసిడి వర్గీకరణ పై స్పష్టంగా రాష్ట్రాలకు అధికారం ఇస్తే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ కాలయాపన చేస్తున్నారని ఎంజెఎఫ్(మాదిగ జర్నలిస్టు ఫోరం) జాతీయ ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. మంగళవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజెఎఫ్ సదస్సు రాష్ట్ర కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం సుప్రీంకోర్టు లో జరిగిన చర్చల అనంతరం ఏబిసిడి వర్గీకరణ అంశాన్ని పూర్తిగా రాష్ట్రాలకు అప్పగించిందన్నారు. అసెంబ్లీలో రెండు సభలో సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ మొట్టమొదటిగా తెలంగాణలో అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికీ మరొక కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారన్నారు.

దీని ద్వారా ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న మాదిగ ఉపకులాల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికీ ఇంకా మాదిగలను మోసం చేయాలని పాలకవర్గాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. దానిలో భాగంగానే ఎమ్మార్పీఎస్ అన్ని విభాగాలను బలోపేతం చేసే దిశగా సమాయత్తం చేస్తున్నామని అన్నారు. ఈ నెలలో మేడ్చల్ జిల్లాలో జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు, దప్పు రామస్వామి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ దేవరంపల్లి అశోక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందూరి కృష్ణ, మరియు సిద్దిపేట, మెదక్ జిల్లాల ఉపాధ్యక్షులు, నావజీవన్ రావు, గందమోళ్ళ శివ, బాలసాయి హరిప్రసాద్, మురళి, జిల్లాలా కార్యవర్గ సభ్యులు, యాదగిరి, రమేష్, జంగయ్య, శ్రీనివాస్, సాగర్, దేవదాస్, రమేష్, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

---

## ఆపన్నహస్త మిత్ర బృందం 98 వ ఆర్థిక సహాయం

జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:



గజ్వేల్ లో ఆపన్న హస్త మిత్ర బృందం కార్యాలయం వద్ద 98 వ ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే కోహెడ పట్టణానికి చెందిన రాజశేఖర్ శిరీష దంపతులకు రియాన్షిక 4 సంవత్సరాల ఒక్కతే కూతురు ఈ మధ్యనే అనారోగ్యంతో ఆసుపత్రిలో చూపిస్తే కాలేయ వ్యాధితో బాధ పడుతుందని తెలిసి ఒక్కసారి దిక్కుతోచనీ స్థితిలో పడ్డారు, తండ్రి బోయిన్పల్లి మార్కెట్లో ఒక గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు, ఉన్నట్టుండి ఈ వ్యాధి ఉంది.కాలేయ మార్పిడి ఒక్కటే అవకాశం అని తెలుసుకొని లక్షల్లో కూడుకున్న వైద్యం ఏమి చేయాలో అర్థం కాక వాళ్ళ పాపని బతికించాలని కోరుకుంటున్నారు.

ఈ విషయం బృందంలోని కొందరి సభ్యుల ద్వారా తెలుసుకొని వారికి మా వంతు సహాయంగా నగదు రూ 20,000 /వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అక్కడి కార్యవర్గ సభ్యులు స్పందించి సిద్దిపేట పట్టణానికి చెందిన అనిల్ టీం, గజ్వేల్ లోని కొందరు కలిసి సుమారు ఒక పదివేల వరకు వ్యక్తిగతంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోషాధి కారి కొల్లూరి శ్యామ్, సహాయ కార్యదర్శి కొలిచెలిమే స్వామి, మంగళసాయి, సభ్యులు, శైలజ, భాగ్యలక్ష్మి, రాణి, శ్రీకాంత్, రాజు , గిరిబాబు ,విష్ణువర్ధన్ రెడ్డి సత్యనారాయణ, అరవింద్ వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

---

## కులగణన సర్వే కు ప్రతిఒక్కరు సహకరించాలి

■ పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనితా రామకృష్ణ

జయభేరి, పరకాల, నవంబర్ 5:



పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారము మంగళవారం పరకాల మున్సిపల్ పరిధిలోని 6వ, 7వ, 20వ వార్డులలో ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల జనగణ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయవలసిందిగా పరకాల మున్సిపల్ చైర్మన్ శ్రీ సోదా అనిత రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యొక్క కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని, ప్రజలందరికీ సమాన హక్కులను అందేటట్టుగా ప్రభుత్వ పథకాలు అందరికీ అందేటట్లుగా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో 6,7,20 ఈ మూడు వార్డులలో 7వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

---



## సీఎంఆర్ చెక్కులు అందజేత

జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:

కొల్గురు గ్రామనికి చెందిన నీరుడి హంసవ్వ భర్త సత్తయ్య కు 13,500/ రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు గ్రామ మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ గొల్ల స్వామి, గ్రామ బిఆర్ఎస్ ప్రెసిడెంట్ ఎర్రవల్లి నరేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు పురం ఆంజనేయులు,జీడిపల్లి నారంరెడ్డి, పురం అనిల్,మల్లం సురేందర్,నిరుడి రాములు, సత్తయ్య , శెట్టి స్వామి,గొడుగు రాజు ,కూరాకుల శ్రీను కుమ్మరి కిష్టయ్య,మాసంపల్లి ఆంజనేయులు, జీడిపల్లి రాజు, శమంతుల సతయ్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

---

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక



జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మంగళవారం సబ్ జూనియర్ బాలబాలికల నెట్ బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపికలు స్థానిక ప్రజ్ఞాపూర్ లోని జెడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ స్కూల్ లో నిర్వహించారు. నెట్ బాల్ ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, మరియు వైస్ ప్రెసిడెంట్ విజయ రేఖ మాట్లాడుతూ ఈ ఎంపికలకు వివిధ పాఠశాలల నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 8 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియం లో జరిగే 7 వ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ ఎంపికలకు పిఇటీలు కే.జ్యోతి,కిరణ్,సందీప్, ప్రశాంత్,వెంకటేశ్వర్లు,పావని, అజెయ్,పాల్గొన్నారు.

---

## ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గింపు

■ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్

జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:

కార్తీక మాసం పురస్కరించుకొని పుణ్య క్షేత్రాల దర్శనానికి విహారయాత్రలకు వివాహాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించినట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత రేట్లతో పోల్చితే ప్రస్తుతం పల్లె వెలుగు బస్సుకు రూ.11, ఎక్స్ ప్రెస్ బస్సుకు రూ. 7, డీలక్స్ బస్సుకు రూ. 8 సూపర్ లగ్జరీకి రూ.6 చొప్పున చార్జీలు తగ్గినట్టు తెలిపారు.

---

## క్రియాశీల సభ్యత్వం పొందండి

■ భాజపా 100 సభ్యత్వాలు చేసిన వారికి క్రియాశీలం సభ్యత్వం

■ గజ్వేల్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్



జయభేరి, గజ్వేల్, నవంబర్ 05:

గజ్వేల్ మండల ముఖ్య నాయకులతో మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భాజపా సభ్యత్వం నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ప్రతి బూత్ లో 50 సభ్యత్వ లు తప్పనిసరిగా చేయాలని 100 సభ్యత్వలు పూర్తి చేసిన వారికీ పార్టీ లో క్రియాశీల సభ్యత్వం ఇస్తుందిని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు 100 సభ్యత్వాలు పూర్తి చేసి క్రియాశిల సభ్యత్వం పోందలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పంజాల రాజు, మండల ఉపాధ్యక్షులు బారు అరవింద్, కిసాన్ మోర్చ అధ్యక్షులు పంజా బాలయ్య, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

## నేషనల్ త్రో బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి రామ్ చరణ్

■ విద్యార్థిని అభినందించిన గ్రామస్తులు

■ బ్యాగ్, ఆర్థిక సాయం అందచేత



జయభేరి, నవంబర్ 5:

శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంకు చెందిన దుద్దడి శ్రీనివాస్ కుమారుడు రామ్ చరణ్ బొల్లారంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా ఇటీవల నిర్వహించిన త్రో బాల్ పోటీల్లో పాల్గొని నేషనల్ త్రో బాల్ పోటీలకు ఎంపికై ఈ నెల 6న యూపిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. అయితే నేషనల్ పోటీల్లో రామ్ చరణ్ మంచి ప్రతిభ కనబరిచాలని కోరుతూ గ్రామానికి చెందిన తాళ్ళ జగదీష్ గౌడ్ లగేజ్ బ్యాగ్ అందచేశారు. అదేవిధంగా కట్ట భాస్కర్, చిట్టీల నర్సింహా తలో వేయి రూపాయలు అందచేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఇక ఎవరైనా విద్యార్థికి సాయం చేయడలచుకునే వారు 7893396467 నంబర్ కు ఫోన్ పే ద్వారా ఎంతో కొంత సాయం అందించాలని వారు వేడుకున్నారు.



## నూతన టీఎస్ యూటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

■ నూతన కార్యవర్గానికి అభినందన

**జయభేరి, నవంబర్ 5:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం నూతన టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా పి. తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా యు.కుమార్, కోశాధికారిగా తిరుమల ప్రసాద్, కార్యదర్శులుగా అంజయ్య, నెహ్రూనాయక్, మనోహర్, మహిళ ఉపాధ్యక్షురాలుగా నాగపూర్ణిమ, మంజుల నియమితులయ్యారు. అదేవిధంగా ముడుచింటలపల్లి మండల నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా కే. నాగరాజు, కార్యదర్శులుగా బి. నర్సింహా , సయ్యద్ షాబాద్, బి. శ్రీనివాసులు ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారు యూటీఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహిపాల్ రెడ్డి కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దేవిజా నాయక్, సత్యనారాయణ, శ్రీనివాసులు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

■ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**జయభేరి, నవంబర్ 5:**

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ లో చోటు చేసుకుంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఫారూక్ (41) అలియాబాద్ లోని హెచ్ బి ఎల్ పరిశ్రమ వ్యవసాయ భూమిలో గత 6 సంవత్సరాల నుండి సూపర్ వైజర్ గా పనిచేస్తున్నారు. కాగా మంగళవారం సాయంత్రం తాను పనిచేసే వ్యవసాయ భూమి వద్ద మంచంపై నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. ఉదయం టిఫిన్ చేసి గార్డెన్ లో పని చేస్తుండగా మధ్యాహ్న సమయంలో కళ్ళు తిరుగుతున్నాయని గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో పార్కులో పనిచేసే జనార్ధన్ గదికి వెళ్లి చూడగా మంచంపై ఫారూక్ వాంతి చేసుకుని చనిపోయి ఉన్నాడు. ఫారూక్ ఆరోగ్య సమస్యల వల్ల కానీ, లేదా ఇతర కారణాల వల్ల మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న శామీర్ పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మారిపోనున్న అనకాపల్లి జిల్లా రాత !




**జయభేరి, అనకాపల్లి జిల్లా :**

ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్స్ పెట్టుబడితో అనకాపల్లి జిల్లా రాత మారిపోనుంది. రెండు దశల్లో రూ. లక్షా నలభై వేల కోట్ల పెట్టుబడులు అంటే విశాఖ స్టీల్ ప్లాంట్ కన్నా ఎక్కువ మందికి ఉపాధి లభించబోతోంది. భూసేకకరణ కూజా పెద్దగా అవసరం లేదు. ఈ కారణంగా ప్రాజెక్టు వీలైనంత త్వరగా మెటీరియలైజ్ కానుంది. వైసీపీ హయాంలో ఐదేళ్ల కాలంలో చిన్న పరిశ్రమను తీసుకురాలేకపోయారు. ఏపీలో పెట్టుబడులు అంటేనే భయపడి పారిపోయే పరిస్థితికి తీసుకు వచ్చారు. కొత్త ప్రభుత్వం ఆ భయాలను పోగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. నాలుగు నెలలకాలంలో ఎన్నో పరిశ్రమల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి కానీ ఆర్సెలార్ మిట్టల్, నిప్పల్ స్టీల్ పెట్టుబడుల ప్రతిపాదన మాత్రం ఊహించనిది. జూలైలో నారా లోకేష్ ఒక్క జూమ్ కాల్ తో పెట్టుబడిదారులను ఒప్పించారు. మిగతా ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మరో వారం రోజుల్లో ఎంవోయూ చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ పెట్టుబడితో ఉత్తరాంధ్ర మొత్తం ప్రభావం ఉంటుంది. ప్రపంచ పెట్టుబడిదారులు చూపు ఉత్తరాంధ్రపై పడే అవకాశం ఉంది. ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌కు పెద్ద ఎత్తున గనులు ఉన్నాయి. చత్తీస్ ఘడ్ నుంచి... ఒడిషా నుంచి వారు ముడి ఖనిజం తెచ్చుకుంటారు. వారికి వనరుల కొరత లేదు. ప్లాంట్ పెట్టడం ఆలస్యం ఉత్పత్తి ప్రారంభమవుతుంది. పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర ఈ ప్లాంట్ తో మరింత ముందుకు వెళ్లనుంది. విశాఖ నగరాన్ని సాఫ్ట్ వేర్ పరిశ్రమల కేంద్రంగా చేయడానికి నారా లోకేష్ ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారు. టీసీఎస్ పదివేల ఉద్యోగులతో క్యాంపస్ ప్రారంభించనుంది. ఉత్తరాంధ్ర పారిశ్రామిక రంగానికి మంచి రోజులు వచ్చేశాయని అనుకోవచ్చు.

## వైభవంగా నాగుల చవితి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో నాగులచవితి పండుగను మహిళల భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే నాగుల చవితి పండుగ సందడి కనిపిచింది. ప్రతి ఏడాది దీపావళి తర్వాత ఐదవ రోజున వచ్చేది నాగుల చవితి. ఈ నాగుల చవితిని పండగను భక్తులు పుట్ట దగ్గరికి వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేసి పాలు పోసి తమ కుటుంబాలను నాగేంద్రుడు కాపాడాలని పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలంపల్లి పార్వతమ్మ, ఆలంపల్లి శిరీష, సముద్రాల సత్య శ్రీవాణి, పందిరి జ్యోతి, గుమ్మడవల్లి మహాలక్ష్మి, బండారు ముత్యాలమ్మ, కండే శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ప్రజలకు తీపి కబురు

■ వరంగల్ ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందన్న మంత్రి కొండా సురేఖ

■ ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తానన్న మంత్రి సురేఖ

■ అత్యుత్తమ నగరంగా వరంగల్ ను అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించిన మంత్రి

■ జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు



**జయభేరి, వరంగల్ :**

జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలోనే సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ లిమిటెడ్ వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు అంగీకరించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి త్వరలోనే మామునూరు ఎయిర్ పోర్ట్ పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రోజు మర్రిచెన్నా రెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి లు వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి పై కూలంకషంగా చర్చించారు. మామునూరు ఎయిర్ పోర్టు, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాజీపేట రోడ్ ఓవర్ బ్రిడ్జ్, భద్రకాళి దేవాలయ మాఢవీధుల పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత, కూడా పరిధి విస్తరణ, జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ తదితర అంశాల మంత్రులు విస్తృతంగా చర్చించారు.

# విపక్ష పాత్ర కూటమిదే..

■ పవన్ కామెంట్స్

**జయభేరి, గుంటూరు, నవంబర్ 5:**



పిఠాపురంలో పవన్ కల్యాణ్ పోలీసుల పనితీరుపై, హోంమంత్రి అనిత పనితీరుపై వ్యాఖ్యలు చేశారు. ఇవి రాజకీయవర్గాల్లో సంచలనంగా మారాయి. ఎందుకు పవన్ కల్యాణ్ ఇలా వ్యాఖ్యానించారో చాలా మందికి అర్థం కాలేదు. కానీ సొంత ప్రభుత్వంపై ఇలా వ్యాఖ్యానించారంటే బలమైన కారణం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ కారణం ఏమిటన్నది మాత్రం సస్పెన్స్ గానే ఉంది. రాజకీయ పరమైన కారణాల ప్రకారం చూస్తే పవన్ వ్యూహాత్మకంగానే ఇలా మాట్లాడారని ఆయన.. ప్రతిపక్షం లేదు అన్న భావన రాకుండా చేయడానికి.. వైసీపీ పాత్రను కూడా తామే పోషిస్తున్నామని ప్రజలకు సంకేతం ఇవ్వడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అనుకుంటున్నారు. ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. అయితే తమకు నలభై శాతం ఓట్లు వచ్చాయని వారంటున్నారు. కానీ ఇప్పటి వరకూ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు ఏమైనా చేసింది కూడా ఏమీ లేదు. నేరాలు, ఘోరాలు జరిగినప్పుడు వెళ్లి పరామర్శించడం తప్ప.. ప్రభుత్వంపై నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు ఏం చేయాలన్నదానిపై వారికో వ్యూహం ఉన్నట్లుగా కనిపించలేదు. అసెంబ్లీ సమావేశాలకూ హాజరయ్యేందుకు వారు రెడీగా లేరు. ఈ పరిస్థితులతో తామే ప్రతిపక్షంగా ఉంటామని కూటమిలోని పార్టీలు వ్యూహాత్మకంగా రెడీ అయినట్లుగా తెలుస్తోంది. ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిణామాలు, గత ప్రభుత్వంలో తమను ఇబ్బంది పెట్టి ఇప్పటికీ దాడులు చేస్తున్న వారిని కంట్రోల్ చేయకపోవడం సమస్యగా మారింది. కూటమి కార్యకర్తలపై దాడులు జరుగుతున్న వార్తలు వస్తున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పవన్ వ్యాఖ్యానించారని అంటున్నారు. పవన్ కల్యాణ్ ప్రకటన చేసిన తర్వాత మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేసింది. పవన్ కల్యాణ్‌కు పొలిటికల్ గా ఒరియంటేషన్ క్లాసులు అవసరం అని ఆయన చెప్పుకొచ్చారు. ఎందుకంటే ఆయన స్వయంగా డిప్యూటీ సీఎంగా ఉండి బహిరంగంగా హోంమంత్రి పనితీరను ప్రశ్నించడం ఏమిటని ఆయన అంటున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేది ప్రతిపక్షమని ఆయన భావన. ఇక్కడ వైసీపీకి లాజిక్ అర్థమవడం ద్వారానే ఇలా స్పందించారని భావిస్తున్నారు. ఎందుకంటే బుగ్గన పార్టీ ఓడిపోయినప్పటి నుండి పెద్దగా బయట కనిపించడం లేదు. పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. హఠాత్తుగా ఆయన మాజీ శాసనసభా వ్యవహారాల మంత్రిగా తెరపైకి వచ్చేశారు. పవన్ ను తప్పు పట్టారు. రాజకీయాలంటేనే వ్యూహాత్మక అడుగులు. ప్రస్తుతం జగన్ రాజకీయంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సొంత కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదంతో ఆయన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పార్టీ నేతలు వరుసగా పార్టీ మారిపోయేందుకు రెడీ అవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఆయన ప్రతిపక్ష పాత్ర పోషించడం కష్టంగా మారింది. అందుకే పవన్ కల్యాణ్ వ్యూహాత్మకంగా తెరపైకి వచ్చి స్వపక్షంలో విపక్షం మాదిరిగా వ్యవహిస్తున్నారని.. వైసీపీ గురించి ప్రజల్లో ఆలోచన లేకుండా చేసే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని అనుకుంటున్నారు. పవన్ కల్యాణ్ ఇలా పోలీసులపై సీరియస్ అవడానికి మరో కారణం ఉందని వారు ..వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ఆరోపణలు.. మార్ఫింగ్‌లను అడ్డుకోవడానికి సీరియస్ గా ప్రయత్నించడం లేదని.. ఆ కోణంలోనూ పవన్ సీరియస్ అయ్యారని అంటున్నారు. అదే నిజమైతే.. వైసీపీ క్యాడర్ మరింత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. మొత్తంగా పవన్ అనాలోచితంగా ఆ వ్యాఖ్యలు చేసి ఉండరని.. రాజకీయంగా ఇబ్బంది అవుతుందని తెలిసినా వ్యాఖ్యలు చేశారంటే ఏదో ఉందని.. వేచి చూడాలని వైసీపీ అనుకుంటోంది.



## అయ్యప్ప స్వామి మాలధారణ

**జయభేరి, దేవరకొండ :**

ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప దేవరకొండ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో బుధవారం ఉదయం 4 గంటల నుండి చిలువేరు చంద్రమౌళి గురుస్వామి ఆధ్వర్యంలో 38వ మాలధారణ కార్యక్రమము ప్రారంభం సందర్భంగా గణపతి హోమం, మూల విగ్రహాలకు అభిషేకములు, అష్టోత్తర పూజలు, స్వాముల మాలధారణలు మరియు అయ్యప్ప దీక్ష స్వాములకు మధ్యాహ్నం 1 గంటలకు అన్నప్రసాద కార్యక్రమము శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ ప్రారంభించ బడును. కావున శ్రీ అయ్యప్ప సేవాట్రస్ట్ సభ్యులు, నిత్యపూజ నిర్వహణ సభ్యులు, సేవాసదన్ నిర్మాణదాతలు, భగవత్ బంధువులందరూ zసమయానికి విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని విజ్ఞప్తి. ఆహ్వానించు వారు దేవరకొండ శ్రీ అయ్యప్ప స్వామి సేవాట్రస్ట్ కార్యనిర్వహణ కమిటీ.

# ప్రతాప సింగారంలో మార్నింగ్ వాక్

■ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

**జయభేరి, ఘట్కేసర్ :**



పోచారం మున్సిపల్ పరిధిలోని ప్రతాప సింగారంలో మార్నింగ్ వాక్ లో భాగంగా మాజీ ఎమ్మెల్యే మాలిపెద్ది సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జాంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. మంగళవారం పోచారం మున్సిపల్ పరిధిలోని ప్రతాప సింగారంలో మార్నింగ్ వాక్ లో భాగంగా మాజీ ఎమ్మెల్యే మాలిపెద్ది సుధీర్ రెడ్డి సానిటేశన్, గోడల పై చిత్రాలు, పచ్చదనం పెంచే చెట్లు పెట్టాలని సూచించారు. వారి ఆదేశాల మేరకు జాంక్షన్ అభివృద్ధి, అలగే తేజశ్రీ కాలనీలో డోజర్ తో రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి చెట్లను తొలగించే పనులను పరిశీలించరు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, నాయకులు జాబేదా బేగం, ప్రభాకర్ గౌడ్, బద్దం కుమార్, నత్తి కృష్ణ, జోగు మల్లేష్, దశరథ్, శ్రీనివాస్, చందు గణేష్, రమణ రెడ్డి, మహిపల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

■ అప్పట్లో జరిగిన తప్పులను సరిదిద్దడంపై దృష్టి పెట్టాం

■ డీజీపీ ద్వారకా తిరుమల రావు

**జయభేరి, అనంతపురం నవంబర్ 5:**



ఏపీలో పోలీసులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై డీజీపీ ద్వారకా తిరుమల రావు స్పందించారు. గత ఐదేళ్లలో కొన్ని తప్పులు జరిగాయని.. అప్పట్లో జరిగిన తప్పులను సరిదిద్దడంపై దృష్టిపెట్టామని తెలిపారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన ప్రొబిషన్ డీఎస్పీ పాసింగ్ పరేడ్‌లో హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి డీజీపీ పాల్గొన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీలకు పలు సూచనలు చేశారు. దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణే తమ విధానం అని డీజీపీ ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. తాము రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లలో పనిచేయమని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై కామెంట్ చేయనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు కూడా సరిగ్గా విధులు నిర్వహించలేదని తెలిపారు. ఓ పార్టీ కార్యాలయంపై దాడి జరిగినప్పటికీ బాధ్యతగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. కేసు పెట్టకుండా భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ నిందితులను అరెస్టు చేయలేదని చెప్పారు. ఈ ఘటనపై మూడేళ్ల తర్వాత చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించడం సరికాదని అన్నారు. తప్పు జరిగితే 30 ఏళ్ల తర్వాత అయినా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. కేరళలో తప్పు జరిగిన 20 ఏళ్ల తర్వాత ఓ ఐపీఎస్‌కు శిక్ష విధించారని తెలిపారు.

## వయనాడ్ లో బీజేపీ పై ప్రియాంక ఫైర్



**జయభేరి, తిరువనంతపురం, నవంబర్ 5:**

వయనాడ్ ఉప ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ అభ్యర్థి ప్రియాంకగాంధీ. పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్నారు. లేటెస్ట్ గా సుల్తాన్ బత్రేలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రియాంకగాంధీ, ఈ ప్రాంత ప్రజల అపారమైన సామర్థ్యాన్ని చూస్తున్నానని అన్నారు. సమస్యలకు నిజమైన, శాశ్వత పరిష్కారాల కోసం ముందుకు సాగడానికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. అందరం కలిసి సంపన్నమైన వయనాడ్‌ను నిర్మిద్దామని పిలుపు ఇచ్చారు. పెరుగుతున్న ఖర్చులు కుటుంబాలపై ఒత్తిడి తెస్తున్నాయని అన్నారు. మానవ – జంతు ఘర్షణలతో పాడి రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు తాము చేసే కష్టానికి బీమా, ఉద్యోగ భద్రత వంటి గౌరవాన్ని కోరుకుంటున్నారని, వారు పడుతున్న బాధలను విన్నానని తెలిపారు. పనిలోపనిగా ఇటీవల వయనాడ్‌లో వచ్చిన వరద విపత్తులపై నోరు విప్పారు కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకగాంధీ. వయనాడ్‌లో ప్రకృతి బీభత్సంపై నోరు విప్పారు. ప్రజలకు తీరని బాధను మిగిల్చిన విపత్తును సైతం బీజేపీ రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారామె. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీజేపీ పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, అధిక ధరల అంశాన్ని డైవర్ట్ చేసేందుకు బీజేపీ కొత్త కొత్త అంశాలను తెరపైకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజల గొంతుకను పార్లమెంటులో వినిపిస్తానని, లోకసభకు పంపాలని ఓటర్లను కోరారు.




# యువతకు నచ్చే ఫ్యామిలీ సినిమా

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. ఈ నెల 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. యూత్‌కి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా ఈ సినిమా ఉంటుందని, గుడ్ కంటెంట్‌తో తెరకెక్కిన ఈ సినిమా అన్ని హక్కులూ అమ్ముడు పోవడం ఆనందంగా ఉందని, 22న సినిమా విడుదల కానున్నదని, 21న ప్రీమియర్లు ప్లాన్ చేశామని, తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుందని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# రీటా టార్గెట్ ఎవరు ?

'రీటా ఓ మధ్యతరగతి అమ్మాయి. చాలా ధైర్యవంతురాలు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఒంటరిగా ఎదుర్కొంటుంది. గన్స్‌తో పాటు ఆయుధాలను వాడటంలో మంచి ప్రావీణ్య ఉంటుంది. ఇంతకి ఆ అమ్మాయి నేపథ్యం ఏమిటి? తను పోలీసా? లేకా అండర్‌వరల్డ్ ఏజెంటా? ఈ విషయాలన్ని తెలియాలాంటే 'రివాల్వర్ రీటా' సినిమా చూడాల్సిందే అంటున్నది చిత్ర బృందం. కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకుడు. జగదీష్ పళనిస్వామి నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తెలుగు హక్కులను నిర్మాత రాజేష్ దండా సొంతం చేసుకున్నారు. హాస్యమూవీస్ పతాకంపై ఆయన తెలుగు రాష్ట్రాల్లో చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పాత్రలో భిన్న పార్శ్వాలుంటాయని, రివాల్వర్ రీటా అసలు లక్ష్యమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. రాధిక శరత్‌కుమార్, రెడిన్ కింగ్స్లీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సీన్ రోల్డాన్, దర్శకత్వం: జేకే చంద్రు.








# లక్నోలో హంగామా

రామ్‌చరణ్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 10న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో భారీ ఎత్తున ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటివరకూ రామ్‌చరణ్ నటించిన చిత్రాలకు పూర్తి భిన్నమైన సినిమాగా 'గేమ్‌చేంజర్' నిలుస్తుందని, నటుడిగా ఆయన్ని మరోస్థాయిలో నిలబెట్టే సినిమా అవుతుందని నిర్మాత దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో తండ్రీకొడుకులైన అప్పన్న, రామ్‌నందన్‌లుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. విభిన్నమైన పీరియడ్స్‌లో ఈ పాత్రలు ఉంటాయని సమాచారం. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే తండ్రి ఎపిసోడ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని తెలుస్తున్నది. తండ్రి పాత్రకు జోడీగా అంజలి నటిస్తుండగా, కొడుకు రామ్‌నందన్‌కు జంటగా కైరా అద్వాణీ కనిపించనున్నది. ఇంకా శ్రీకాంత్, సముద్రఖని, ఎస్.ఎజె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇదిలావుంటే.. నిర్మాత దిల్‌రాజు ఈ సినిమా ప్రచారాన్ని వేగవంతం చేశారు. అందులో భాగంగా ఈ నెల 9న లక్నోలో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నారు. లక్నోలో ఇంత భారీగా టీజర్ రిలీజ్ చేస్తున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం.



# ఫహద్ ఫాసిల్ సినిమాపై కన్నేసిన రవితేజ..

మాలీవుడ్ నుంచి ఎంట్రీ ఇచ్చి టాలీవుడ్‌లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుని.. పాన్ ఇండియా స్టార్ డమ్ కొట్టేసిన అతికొద్ది మంది యాక్టర్లలో ఫహద్ ఫాసిల్ ఒకడు. ఈ స్టార్ యాక్టర్ కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే క్రేజ్ మామూలుగా ఉండదు. ఫహద్ ఫాసిల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఆవేశం. గ్యాంగ్ స్టర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రం మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఇప్పుడీ సినిమా తెలుగులో కూడా రాబోతుందా..? తాజా కథనాలు అవుననే సంకేతాలిస్తున్నాయి. టాలీవుడ్ యాక్టర్ రవితేజ ఆవేశం తెలుగు రీమేక్ హక్కులను సొంతం చేసుకున్నట్టు ఓ వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తోంది. ఈ కథ రవితేజ మ్యానరిజానికి పర్‌ఫెక్ట్ సెట్ అవుతుంది. అయితే మరి రవితేజ హీరోగా నటిస్తాడా..? లేదంటే హోం బ్యానర్ ఆర్‌టీ టీమ్ వర్క్స్ బ్యానర్‌లో తెరకెక్కించి నిర్మాతగానే వ్యవహరిస్తాడా..? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ వార్తలపై రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి. ఫహద్ ఫాసిల్ నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ డిసెంబర్ 5న గ్రాండ్‌గా విడుదల కానుంది. రవితేజ ప్రస్తుతం ఆర్‌టీ 75 ప్రాజెక్టుతో బిజీగా ఉన్నాడు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com